చప్పుడు కాకుండా దెయ్యం ఎట్లా నడిచిపోయిందా అని అతను కాస్త ఆశ్చర్యపడ్డాడు. అంతసేపూ ఆగిపోయిన కాలం తిరిగి కదిలినట్టు లక్ష్మణరావుకి అనిపించింది. దెయ్యాన్ని వెళ్ళనిచ్చి అతను ఇంకా ఆ తోటలో వుంటే అది మళ్లా ప్రేమచేత తిరిగి వస్తుందేమో అని అనుకుని, 'ఈ బరువుకూడా ఎందుకని చేతిబెత్తం కింద పారేసి ఒక్కటే పరుగు పుచ్చుకొని రోడ్డు దగ్గరికి వచ్చి, మాలాళ్ళ కొంపలదాకా మళ్లా దవుడు తీసి, వెనక్కి తిరిగి చూసి, దెయ్యం తనవెంట రానందుకు సంతోషించి, తాను బతికివున్నందుకు భగవంతుడికి వెయ్యిదండాలు పెట్టి వడివడిగా నడిచి ఇంటికి వెళ్లిపోయాడు.

లక్ష్మణరావు పరుగెత్తి వెళ్ళిన తర్వాత ప్రకాశరావు తాను ఒంటిమీద కప్పుకున్న దోమతెర తీసేసి మూటకట్టుకున్నాడు. నెమ్మదిగా ఇంటికి బయలుదేరాడు. ప్రకాశరావు తాను మామిడిచెట్టు దగ్గర నడుస్తూన్నంతసేపూ చప్పుడుకాకుండా వుండేటందుకుగాను తాను తోటలోకి వచ్చినవెంటనే ఆచెట్టు చుట్టూవున్న ఎండుటాకులు తీసేసి దూరంగా పారేశాడు. లక్ష్మణరావు 'వెళ్ళు' అని అన్నప్పుడు, అతను మామిడిచెట్టు వెనక్కి వెళ్ళిపోయాడు. కాని లక్ష్మణరావుమాత్రం దెయ్యం వెళుతూ వెళుతూ చిన్నదయిపోయిందనీ, ఆకుల చప్పుడు కాకుండా నడిచిందనీ భ్రమపడ్డాడు. ప్రకాశరావు తాను సుబ్రహ్మణ్యందెయ్యంభూమిక చక్కగా ధరించినందుకు తన్ను అభినందించుకుంటూ తన యత్నం లక్ష్మణరావుమీద తప్పకుండా పనిచేస్తుందని అనుకుంటూ ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

లక్ష్మణరావు ఆతర్వాత ఒడుగుచేసుకోలేదనీ, చిన్న పిల్లను పెళ్ళిచేసుకోడం మానేశాడనీ పాఠకులకు వేరే చెప్పనక్కర్లేదు. అతను కొన్నాళ్ళయిన తర్వాత ఒక వితంతు పిల్లను పెళ్లిచేసుకున్నాడు. సంఘసంస్కరణవిషయంలో అతను ఎటువంటి కష్టాలకూ వెనుతియ్యక, తన తండ్రినే ఆదర్శంగా పెట్టుకుని ప్రవర్తించాడు.

—పేకుమళ్ళ కామేశ్వరరావు, బి.ఏ.

# ఇది ఉఋముఱిమి మంగలంమీద పడ్డమేనా?

౧

రామారావూ, చంద్రమూ కలసి సుబ్బులింటికెళ్లేరు. వీళ్ళని చూసి పార్వతికూడా అక్కడను పరుగెత్తుకు వచ్చింది.

'డాక్టరాట ఆడుకుందామటే?' అన్నాడు చంద్రం.

'ఆఁ ఆడుకుందాం; మా ఇంట్లో మందులున్నాయ్; థర్మామీటరుంది' అంది పార్వతి.

'సరే, నడువు; మీయింటికే వెళ్ళి ఆడుకుందాం' అన్నాడు చంద్రం. సుబ్బులు వాళ్ళకూడా వెళ్ళింది.

పార్వతి వాళ్ళనందరినీ బోషాణం వెనకాల కూచోమని లోపలికెళ్ళి, వాళ్ళ అమ్మా, నాన్నా చూడకుండా బీరువాలో ఉన్న హోమియోపతీ మందుల పెట్టీ, బల్బుపగిలిన థర్మామీటరూ తెచ్చింది. చంద్రం 'నేను డాక్టరిని; నేను డాక్టరుని' అని కేకలేశాడు.

'నేను - నేను' అని అరిచింది సుబ్బులు. వీళ్ళ అల్లరివిని 'ఎవరురా అక్కడ' అని సింహగర్జనచేసింది పార్వతితల్లి.

చప్పుడుకాకుండా చంద్రమూ, సుబ్బులూ వీధితలుపు తీసుకొని బైటపడ్డారు. మిగిలినవాళ్ళు దొడ్డిదారి పట్టేరు. అందరూ కావమ్మగారి ఇంటికెళ్ళేరు. వాళ్ళగాదెకు వెనకాల ఓచాపవేసుకు కూచున్నారు.

'జ్వరం ఎవరికొచ్చిందో వాళ్ళు పడుకోండి' అన్నాడు చంద్రం.

'నాకు జ్వరమొచ్చిం'దని, దుప్పటి కప్పుకొని పడుకుంది పార్వతి.

'ఎల్లావుందమ్మాయీ' అని పార్వతిదగ్గరకొచ్చి పొట్టమీద చెయ్యివేసిచూసి 'అమ్మో! ఎంతజ్వరమో' అంది సుబ్బులు.

'అబ్బా! వుండవే; నన్ను చంపుతావ్ ?' అంటూ చెయ్యి అవతలకు విదలించింది పార్వతి.

డాక్టరుగారు లోపలికొచ్చారు. సుబ్బులూ, కావమ్మ ఓపక్కగా నుంచున్నారు.

'నీకు జరంగావుందా ?'

'మరే.'

'దగ్గొస్తోందా ?'

'ఒస్తోంది' అని నెమ్మదిగా దగ్గింది.

'ఈథర్మామీటరు నోట్లోపెట్టుకో.'

* * *

'అబ్బో! జ్వరం చాలాఉంది; ఇవిగో ఈమాత్రలు మింగు' అని పదిమాత్రలు సీసాలోంచి తీసి ఇచ్చాడు చంద్రం.

కాసేపు అల్లాగే పడుకొని ఉంది పార్వతి. సుబ్బులొచ్చి 'ఇక లేవవే' అంది. పార్వతి లేచికూచుంది.

'జ్వరంపోయిందా?' అన్నాడు చంద్రం.

'ఆఁ పోయింది' అంది పార్వతి.

'నాకూ జ్వరంగాఉంది—రెండుమాత్రలీయవురా?' అంది కావమ్మ. చంద్రం నాలుగుమాత్రలిచ్చాడు.

'నాకు కాలునెప్పిగా ఉంది' అంది సుబ్బులు.

'నాకు తలనెప్పిగాఉంది' అన్నాడు రామారావు.

అందరికీ, తలోనాలుగూ ఐదూ ఇచ్చి తాను తిండానికి సీసాడుమాత్రలైతే చేతిలో ఒంచుకున్నాడు చంద్రం.

'అమ్మో! అన్నిమాత్రలే! మానాన్న తిడతా'డంటూ కలియబడి లాక్కోబోయింది పార్వతి.

చంద్రం తొందరపడి నోటిలో వేసుకోబోయాడు. రామారావు వెనకాలనుంచి చేతిమీద కొట్టేడు. అన్నీ కింద పడిపోయినాయి; ఎవరికి దొరికినవి వాళ్ళు తిన్నారు. మందులపెట్టి తీసుకొని ఏడుస్తూ ఇంటికెళ్లిపోయింది పార్వతి.

## ౨

'ఏమే, ఏడుస్తున్నావేం?'

'వాళ్ళచంద్రం కొట్టేడు.'

'అయిందిగదా? నీకంతే కావాలిలే. అయ్యో! ఆ మందుల పెట్టి ఎప్పుడు పట్టుకెళ్ళేవే? ఆసి నిన్ను...'

'నేను పట్టుకెళ్ళలేదు.'

'నువ్వు పట్టుకెళ్లకపోతే నీచేతిలోకి ఎల్లావచ్చిందీ? ఏది ఇల్లాతే.'

'........................'

'ఆసి, నీయిల్లు వల్లకాడుగానూ, మందులన్నీ కాజేశావులే? జబ్బుచేస్తుంది కూడాను ఇవన్నీ తింటే— ఏం సాధనమమ్మా?........ఊఁ ఆ చంద్రిగాడితో నిన్నెవ రాడమన్నారే?' అంటూ బుగ్గలు సాగతీసి, ఓ చరుపు చరిచింది.

'వాడేతెమ్మన్నాడు.' (ఏడుస్తూ)

'ఛా, నోర్మూయి; వాడు గడ్డితినమంటే తింటావా?' అని మళ్ళీ ఈ లెంపా ఆ లెంపా వాయించి పైకి ఏడవొద్దని శాసించి, 'నాన్నొచ్చేదాకా నోరు మూసుకొని, కదలకుండా అల్లాగే కూచో—నీరోగం కుదిరిపిస్తా' అని లోపలి కెళ్ళిపోయిం దామె.

పార్వతల్లాగే నోరుమూసుకు కూచుంది. కొంతసేపటికి వాళ్ళ నాన్నొచ్చి 'ఏమిటే, అల్లా నోరుమూసుక్కూచున్నావ్ ?' అన్నాడు చేత్తో వీపుతట్టుతూ.

'అమ్మ కొట్టింది' అని బావురుమంది పార్వతి.

'నేను కనుక్కుంటాను, ఊరుకో' అని సముదాయించి, ఏడుపుమానినతర్వాత లోపలికెళ్ళి, 'ఏమే, పిల్ల కంతకఠినశిక్ష విధించావ్?' అన్నాడు.

'ఆఁ విధించరు! వెధవల్లరీ ఇదీనీ. ఆ చంద్రిగాడితో కలసి నానాఅల్లరీనీ; ఆమందులన్నీ ధ్వంసంచేశారు. తియ్యగా ఉంటాయిగదా అని తిన్నన్ని తిన్నారు— చూశారా ఈ సీసాల్లో దుమ్మెంత కలిపేరో?'

'దాన్నెందుకు తీసికెళ్ళనిచ్చావు నువ్వు?'

'అదుగో, నేననుకుంటూనే ఉన్నా అల్లా అంటారని; ఉలుముటిమి మంగలంమీద పడిందిట! అది పాడుచేయడమేమిటి? మీరు నన్ను నిలదీసి అడగడమేమిటి? మాబాగాఉంది.'

'ఐతే, అందేం అల్లరిచేస్తున్నా, ఏవిపాడుచేస్తున్నా నువ్వు చెప్పనక్కర్లేదన్నమాట!'

'చెప్పకేం? చెప్పాలి. ఒకమాటు, చెప్పొచ్చు; రెండుమాట్లు చెప్పొచ్చు ఉదయాస్తమానాలూ అల్లరయితే ఎన్నింటికని చెప్పి చచ్చేది? ఐనా ఆ చంద్రిగాడు ఏం వెధవఅల్లరిపనులు నేర్పుతున్నాడమ్మా పిల్లకి?—మధ్య నాకొస్తున్నాయ్ చివాట్లు' అంటూ అశ్రుధారాస్త్రాన్ని ప్రయోగించి దొడ్లోకి వెళ్ళిపోయింది.

'ఏమిటీ అంటున్నావ్? చేతనైతే పిల్లల్లరి చేయకుండా చేసుకోవాలి వాళ్ళను కొడితేనూ తిడితేనూ ఏంలాభం? అజ్ఞానులుగదా? ఊఁ.'

'ఏమో మరి, నేనంత చదువుకోలేదు, ఈమాత్రపు ఊహా కలగడానికి.'

'చాలులే ఊరుకో ఈపాటికి; పిల్ల మందులపెట్టి ముట్టుకోకుండానే చూడాలి; నీ కా తెలివితేటలు లేకపోతే నోర్మూసుకు కూచోవాలి. దాన్ని చితకకొడితే వస్తుందా ఇప్పుడు? ఆ శాంతమే ఉండాలని చెప్పేది-నేను;'

'.........................'

'మొన్న పిల్లనేదో అన్నారని ఆ వెంకమ్మగారి ఇంటిమీది కెళ్ళేవుగదా యుద్ధానికీ—చంద్రశేఖరాన్ని చంద్రిగాడనడం వింటే వాళ్లూరుకుంటారా? నీపిల్ల నీకెంత ముద్దో వాళ్ళ పిల్లాడు వాళ్లకంత ముద్దుకాదూ? ఆమాత్రం తెలియక్కర్లేదూ?'

'ఎప్పుడూ, ఇల్లా ఊళ్ళోవాళ్ళనే వెనకేసుకొచ్చారు; ఎందుకూ ఈగొడవ? నాదే బుద్ధితక్కువలెండి.'

'ఊరుకో ఇంక.'

## 3

పిల్లలందరూ చేరారు వీధులో; చంద్రం తెచ్చిన బంతితో కొంతసేపాడుకున్నారు 'ఇక రైలాట ఆడదాం, వరసగా నుంచోం' డన్నాడు చంద్రం. ఒకరి బుజం ఒకరు పట్టుకొని నుంచున్నారు. ఇంజనుస్థానంలో చంద్రం నుంచుని 'కూ' అని గట్టిగా కూసి 'ఝూంప్, ఝూంప్' అంటూ బండి సాగించాడు. ఒకటి రెండు వీధులు తిరిగింది బండి. వీళ్ళల్లరివిని పార్వతి వీధిలోకి పరుగెత్తుకువచ్చింది. దొడ్లో ఉన్న వాళ్ళమ్మ ఒస్తోందేమో అని లోపలికి తొంగిచూసి, వాళ్ళల్లో కలిసి, వెనకా లోరైలుపెట్టిగా నుంచోబోయింది. మందులపెట్టి మళ్ళీతెస్తానంటే మాతో ఆడనిస్తామన్నాడు చంద్రం.

'ఊఁ' అనబోతోంది పార్వతి.

తల్లి, లోపలకిటికీకి ప్రక్కగా నుంచుని 'నేను చెబితే నమ్మరు; చూడండి వాడివేషాలు; మళ్ళీ మందులపెట్టి తెస్తేనేగాని మాతో ఆడనివ్వమంటున్నాడు. —ఇల్లారారేం?' అని భర్తను కేకేసింది.

'పిల్ల లేవో అల్లర్లుచేస్తారు. ఊరుకుందూ' అన్నాడు భర్త.

ఇంకా సంభాషణ ఎల్లాజరుగుతుందో చూద్దామని ఆ కిటికీదగ్గరే నుంచుందామె.

మందులపెట్టి తీసుకురావడానికి అంగీకరించి వాళ్ళతో వెడుతోంది పార్వతి. తల్లి వీధులోకెళ్ళి పార్వతిని కేకేసి చివాట్లు పెట్టి, లోపలికి తీసుకువచ్చింది.

పార్వతితల్లి వీధులోకి రావడంతోటే, మందులన్నీ ఎందుకు తిన్నావని తన్ను కొడతుందేమో అని భయపడ్డాడు గాబోలు చంద్రం—జోరుగా పోనిచ్చాడు బండిని.

ఏడుస్తూ లోపలికొచ్చిన పార్వతిని చూసి, భార్యను చీకొట్టి 'వెళ్ళి ఆడుకో—నీకేం భయంలే' దంటూ కుమార్తెనావలకు పంపేడు తండ్రి.

—పమ్మి రామశాస్త్రి.